# ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి
- పలు అభివృద్ధి పనుల ప్రారంభం



జమ్మికుంటలో బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ దగ్గర గీతకార్మికులతో ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట, అక్టోబర్ 5: సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో మీ ముందుకు వస్తున్నానని, నన్ను గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంటలో ముదిరాజ్, బెస్త సంఘం భవనాలకు భూమి పూజ చేశారు. పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ దగ్గర గీతకార్మిక సంక్షేమ సంఘం భవనానికి భూమి పూజ చేశారు. కొత్తపల్లిలో అత్యాధునిక ధోబీఘాట్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి న్యాయం చేస్తుందన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత నియోజకవర్గంలోని గ్రామాలను అభివృద్ధి చేశానన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా తనను సీఎం కేసీఆర్ ప్రకటించారని, అన్ని వర్గాల వారు ఆదరించి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమైందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలను కోరారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమం ద్వారా ప్రజలకు న్యాయం చేస్తుంటే ఓర్వలేని ప్రతిపక్షాలు అనవసరపు విమర్శలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజలు నమ్మరని, సీఎం కేసీఆర్‌కే ప్రజలు అండగా నిలుస్తారన్నారు. తెలంగాణ సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడైనా ఉన్నాయా? అని అడిగారు. కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్నాకోటి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



ఈదులకంటి రవీందర్‌రెడ్డికి శాలువ కప్పి అభినందనలు తెలుపుతున్న కౌశిక్‌రెడ్డి

## కౌశిక్‌రెడ్డికి మద్దతు తెలిపిన ఆర్ఎస్ఎస్ ముఖ్యుడు

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 5:ఆర్ఎస్ఎస్ ముఖ్యుడు, హుజూరాబాద్‌కు చెందిన సీనియర్ కాషాయ నాయకుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి తన సంపూర్ణ మద్దతును బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డికి ఇస్తున్నట్లు గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. కౌశిక్‌రెడ్డి ఆయన స్వగృహంలో గురువారం రవీందర్‌రెడ్డితో భేటి అయ్యారు. ఈ సందర్భంగా హుజూరాబాద్ ప్రత్యేక జిల్లా ఏర్పాటుపై అతడితో చర్చించారు. రాబోయే ఎన్నికల్లో తాను కేసీఆర్ కోసం పని చేస్తానని రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డికి కౌశిక్‌రెడ్డి శాలువ కప్పి కృతజ్ఞతలు తెలిపారు.

## రేషన్ దుకాణాలకు బతుకమ్మ చీరలు

కరీంనగర్ రూరల్: ఆక్టోబర్ 5: కరీంనగర్ మండలంలోని 16 గ్రామాలకు బతుకమ్మ చీరలను మండల రెవెన్యూ అధికారులు పంపిణీ చేశారు. గురువారం కరీంనగర్ మండలంలోని 16 గ్రామాల్లోని 25 రేషన్ దుకాణాలకు గాను మొత్తం 15,814 చీరలను అందించాల్సి ఉండగా, మొదటి విడతగా 72 శాతం 12, 261చీరలను పంపిణీ చేశారు. గ్రామాల వారీగా వివరాలు... బొమ్మకల్‌లోని నాలుగు రేషన్ షాపులకు మొత్తం 2,580 చీరలను రేషన్ డీలర్లకు అందించారు. బహద్దుర్‌ఖాన్‌పేటకు 219 చీరలను, చామనపల్లిలోని రెండు రేషన్ షాపులకు 875 చీరలను అందించారు. చెర్లభూత్కూర్‌లోని మూడు రేషన్ షాపులకు 1,066 చీరలు, చేగుర్తి గ్రామానికి 491 చీరలు, దుర్శేడ్‌లోని రెండు రేషన్ షాపులకు 1,039 చీరలు, దుబ్బపల్లిలో156 చీరలు, ఎలబోతారం గ్రామాలకు 474 చీరలు, ఫకీర్‌పేటకు 163 చీరలు, గోపాల్‌పూర్ గ్రామానికి 822 చీరలు, ఇరుకుల్ల గ్రామానికి 339 చీరలు, జూబ్లీనగర్ గ్రామానికి 337 చీరలు, మందులపల్లి గ్రామానికి 180 చీరలు, మొగ్దుంపూర్ గ్రామానికి 798 చీరలు, నల్లగుంటపల్లికి 148 చీరలు, నగునూర్‌లోని మూడు రేషన్ షాపులకు గానూ 1480 చీరలను పంపిణీ చేశారు. కరీంనగర్ మండలంలోని అన్ని గ్రామాలకు మొత్తం 12261 చీరలను తరలించారు. రేపు మొగ్దుంపూర్‌లో మంత్రి గంగుల కమలాకర్ చీరలను పంపిణీ చేస్తారని అధికారులు తెలిపారు.

## ఆర్టీసీ గ్యారేజీ సిబ్బందికి శిక్షణ తరగతులు

తెలంగాణచౌక్, అక్టోబర్ 5: ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోల పరిధిలో విధులు నిర్వహిస్తున్న గ్యారేజీ సిబ్బందికి బస్టాండ్ కాంప్లెక్స్ పరిధిలో గల సమావేశ మందిరంలో గురువారం జోనల్ ఈడీ వినోద్ కుమార్, ఆర్ఎం సుచరితతో కలిసి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు. ప్రతి ఉద్యోగి కాలానుగుణంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా వృత్తిలో నైపుణ్యాన్ని పెంపొందుంచుకోవాలన్నారు. ఈ శిక్షాణ తరగతులను ఈనెల 13 వరకు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి డిపోలను ప్రతి రోజు 60 మందికి చొప్పున గ్యారేజీ సిబ్బందికి శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం సత్యనారాయణ, డీఎంలు మల్లయ్య, మల్లేశం, పర్సనల్ మేనేజర్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఈడీని కలిసిన డీఆర్ఎం

తెలంగాణచౌక్,అక్టోబర్ 5: డిప్యూటీ ఆర్ఎంగా బాధ్యతలను స్వీకరించిన భూపతిరెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా ఈడీ వినోద్ కుమార్‌ను తన చాంబర్‌లో గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఈడీ పుష్పగుచ్ఛం అందజేశారు.

## చెర్లభూత్కూర్‌లో గొర్రెల యూనిట్లు పంపిణీ

కరీంనగర్ రూరల్: ఆక్టోబర్ 5: కరీంనగర్ మండలంలోని చెర్లభూత్కూర్‌లో బుధవారం ఆరు గొర్రెల యూనిట్లను గ్రామ సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా చెర్లభూత్కూర్ నుంచి 31 మంది గొర్రెల కాపరులు డీడీలు చెల్లించగా, ఇప్పటి వరకు 18 మందికి మాత్రమే గొర్రెలను అందజేశారని, గొర్రెల యూనిట్ విలువ రూ.1,75,000 కాగా లబ్దిదారుడి వాటా రూ.43,750 చెల్లించాల్సి ఉంటుందన్నారు. మిగతా రూ.1,31,250 ప్రభుత్వం సబ్సిడీ చెల్లిస్తోందని, ఒకొక్క యూనిట్‌లో 20 ఆడ గొర్రెలు, ఒక పొట్టేలు కలిపి, 21 గొర్రెలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఆరుగురికి గొర్రెలను మండల వైద్యాధికారి పంపిణీ చేయగా, రెండో రోజున గ్రామ సర్పంచ్ అధ్వర్యంలో గురువారం చెర్లభూత్కూర్‌లోని వీరప్ప ఆలయం వద్ద గొర్రెలను ఈరు లక్ష్మణ్, కాడారి శ్రీకాంత్, ఈరు అశాలు, జడ కుమారస్వామి, ఈరు రాజు, చిట్కూరి ఎల్లయ్య, రెండో రోజున ఆరు గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు. మరో రెండు రోజుల్లో మరో ఆరుగురికి యూనిట్లు అందిస్తారని పశు వైద్యధికారి రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, ఎంపీటీసీ బుర్ర తిరుపతి గౌడ్, వైద్య సిబ్బంది సమ్మయ్య, గొర్రెల కాపారుల దారుల సంఘం అధ్యక్షుడు చిట్కూరి సతీశ్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలతో మమేకమై విధులు నిర్వర్తించాలి

రాంనగర్, అక్టోబర్ 5: ప్రజలతో మమేకమై అంకితభావంతో సేవలు అందించినప్పుడే మనకు విశిష్టమైన గుర్తింపు వస్తుందని రాజస్తాన్ రాష్ట్ర క్యాడర్ రిటైర్డ్ ఐజీ ఆనంద్ శుక్లా అన్నారు. గురువారం నగరంలోని హెడ్‌క్వార్టర్‌లోని కాన్ఫరెన్సు హాల్‌లో స్టేషన్ హౌజ్, ఏసీపీలు, ఇన్వెస్టిగేషన్, సాఫ్ట్ స్కిల్స్ ప్రాధాన్యత, యాక్టివ్ లిజనింగ్ వల్ల చేకూరే లాభాలపై ఆయన ప్రసంగించారు. ప్రధానంగా ఇన్వెస్టిగేషన్‌లో సమస్య ఉత్పన్నం చేసేటువంటి మూలాలను గుర్తించి అందులో ఫిర్యాదుదారుడు, నేరస్తుడి మధ్య ఇతివృత్తం సంధానం చేయడం వల్ల త్వరగా ఫలితాలను పొందొచ్చని, అంతేకాకుండా సీసీ కెమెరాలను అందుకు అనుగుణంగా అమర్చుకోవడం వాటి అనుసంధానాన్ని విశ్లేషణను కలిగి ఉంటే వేగవంతమైన ఫలితాలు ఉంటాయన్నారు. నాలుగు ముఖ్యమైన అంశాలు అయిన సహాయం, గౌరవం, రిసెప్షన్, రెస్పాన్స్, రికవరీని అందించటం వల్ల ఫిర్యాదుదారుడు కోరుకునే అంచనాలు మనం చేరుకోగలమని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు రాజు, లక్ష్మీనారాయణ, ఏసీపీలు నరేందర్, కరుణాకర్‌రావు, జీవన్‌రెడ్డి, మాధవి, కాశయ్య, సిప్రతాప్, జిల్లాలో ఉన్న స్టేషన్‌హౌజ్ అధికారులు, ఎస్ఐలు, సీఐలు పాల్గొన్నారు.

## హుజూరాబాద్ జిల్లా కోసం వినతి

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 5: పీవీ హుజూరాబాద్ జిల్లా ఏర్పాటు చేయాలని జిల్లా సాధన జేఏసీ నాయకులు మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గురువారం సింగాపూరంలోని నివాసంలో కెప్టెన్, హుజూరాబాద్‌లో కౌశిక్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వినతిపత్రం అందించారు. జిల్లా ఏర్పాటుకు చొరవచూపాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయకులు వర్థినేని రవీందర్‌రావు, హనుమంతుగౌడ్, ఎర్రం పాపిరెడ్డి, రవీందర్‌రెడ్డి, వేల్పుల రత్నం, సమ్మిరెడ్డి, తాళ్లపల్లి రమేశ్, పొడిశెట్టి వెంకటరాజం, డాక్టర్ తడికమళ్ల శేఖర్, భీమోజు సదానందం, వేల్పుల ప్రభాకర్, రామ్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

## రేపు ఇంటర్వ్యూలు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 5: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కలిపించేందుకు 7వ తేదీ (శనివారం) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్న 2 గంటల వరకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి కే దేవేందర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా కరీంనగర్, ఇతర జిల్లాలో ప్రముఖ గ్లిట్జ్ కార్ప్ కంపెనీలో టెక్నీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, మెకానికల్, మెషిన్ ఆపరేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఇందుకోసం పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ పూర్తిచేసి, 18 నుంచి 30 ఏండ్ల వయస్సు వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందులో ఎంపికైన అభ్యర్థులకు రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు బయోడేటా, జిరాక్స కాపీలతో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పన కార్యాలయంలో హాజరు కావాలన్నారు. మరింత సమాచారం కోసం 88861 31012, 93926 64569, 72076 59969 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

# కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపిక

కొత్తపల్లి, అక్టోబర్ 5 : జిల్లా కేంద్రంలోని పద్మనగర్‌లోని మానేరు సెంట్రల్ స్కూల్‌లో మూడు సంవత్సరాలుగా వ్యాయామ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న తాళ్లపల్లి జయంతి బుధవారం రాత్రి వెల్లడించిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికైంది. సొంతూరు నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం తాటిపల్లి గ్రామం కాగా మూడు సంవత్సరాలుగా మానేరులో పాఠశాలలో వ్యాయామ విద్య ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నది. పలు క్రీడల్లో ఎందరినో రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొనేలా తయారు చేసిన జయంతిని గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అభినందించారు. చిన్న వయసులోనే ఉద్యోగం పొందడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో పోలీస్‌శాఖలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాళ్లు రాజు చాకో, సరితారెడ్డి, పీఈటీలు సిలివేరి మహేందర్, తిరుపతి, మహేందర్ నాయక్, జహేదా తదితరులు ఉన్నారు.



కొత్తపల్లి : జయంతిని అభినందిస్తున్న అనంతరెడ్డి

విద్యానగర్, అక్టోబర్ 5: 19వ డివిజన్‌లోని సివిల్, ఎఆర్ గా కరీంనగర్ డిస్ట్రిక్ట్ ఫస్ట్ వచ్చిన ఆవుదుర్తి నీవన్, మామిడిపల్లి శ్రీనివాస్, పొన్నం సౌమిత్ ఆస్తపురం శ్రీలేఖలను డివిజన్ కార్పొరేటర్ ఎదుల్ల రాజశేఖర్ సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి దుర్గాప్రసాద్ , డివిజన్ అధ్యక్షులు కత్తెరపాక ఆంజనేయులు, జనరల్ సెక్రెటరీ హస్తాపురం తిరుపతి, ఉపాధ్యక్షులు గడ్డం దామోదర్, ఏదుల జితేందర్, డివిజన్ జీకే అధ్యక్షులు వామనాచారి పాల్గొన్నారు.

గంగాధర, అక్టోబర్ 5 : తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన తాళ్ల వినోద్‌కుమార్ సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. గురువారం స్థానిక మాల సంఘం నాయకుడు తాళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినోద్‌కుమార్‌ను సన్మానించి అభినందిచారు. ఇక్కడ నాయకులు తాళ్ల సురేశ్, తాళ్ల లక్ష్మణ్, తాళ్ల అంజయ్య, తాళ్ల నరేశ్, తాళ్ల నవీన్, తాళ్ల మొండయ్య ఉన్నారు.

# నేషనల్ షూటింగ్ బాల్ పోటీలకు పారమిత విద్యార్థి

కొత్తపల్లి, అక్టోబర్ 5 : జాతీయ షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 8 వరకు నిర్వహించే 42వ జాతీయ జూనియర్ అండర్ 19 షూటింగ్ బాల్ చాంపియన్ షిప్ పోటీలకు నగరంలోని పారమిత పాఠశాల విద్యార్థి ఎంపికయ్యాడు. పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి డీ అశ్విత్ పటేల్ ఇటీవల మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ పోటీలకు అర్హత పొందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రితేష్ మెహతా వెల్లడించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన అశ్విత్ పటేల్‌ను విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రాకేశ్, వీయూఎం ప్రసాద్, వినోద్‌రావు, హన్మంతరావు, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, సమన్వయకర్తలు రాము, రబీంద్రపాత్రో, హరిప్రియ, సరిత, పీఈటీలు గోలి సుధాకర్, సరిగొమ్ముల రాజు, పండుగ సంతోష్ పాల్గొన్నారు.



విద్యార్థి అశ్విత్ పటేల్‌ను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం